




# చెప్పకనే చెప్పను చెప్పులు

## అమెరికాకమ్మ కథలు- 9

ఈ మధ్య నాకు కొత్తగా తెలిసినది ఏమిటంటే, గృహస్థు మరియు అతిథుల విషయాలలో నాకు ఏమీ తెలియదూ అని. ఎందుకంటే ఇటీవల అనేక నగరాలలో, మరొక ముగ్గురితో కలిసి కనీసం నలభై మంది అమెరికాలో తెలుగు వారింట బస చేసి వారి - ఆతిథ్యం పొందాను. నా పేరూ, మరియు ఇతర విషయాలు అక్కడా, అక్కడా విన్నవాళ్ళు ఒక మోస్తరుగానూ, నేను కేవలం అనామకుడుగానే తెలిసిన వారు మిగిలిన ముగ్గురికే కారు డ్రయివరుగానూ నన్ను ఆదరించారు. కొంతమంది ఇళ్ళలో నన్ను అఖండమైన గౌరవంతో చూడడం చూసి సిగ్గేసింది కూడానూ. మొత్తానికి కొంత మంది గృహస్తులు నేను అడుగుపెట్టినప్పుడు కొంచెం ఆనందించినా, చించకపోయినా, భవదీయుడు వెళ్ళిపోతునప్పుడు మహానందపడ్డారని కూడా నేను కనిపెట్టేశాను.

అమెరికాలో నేను ఎవరింటికైనా వెళ్ళినప్పుడు ముందుగా ఎదుర్కునే కిష్టమైన సమస్య ఏమిటంటే వాళ్ళు ఇంట్లోకి ప్రధాన ద్వారంలో.. అనగా ముందు గుమ్మంలోంచి లోపలికి వెళ్ళాలా, లేక కార్లు పెట్టుకునే గరాజ్‌లోంచి లాన్ మూవరూ, క్లీనింగ్ సామానులూ, అవసరం ఉన్నా, లేక పోయినా సేల్‌లో దొరికాయి కదా అని కొనుక్కున్న చెత్తా చెదారమూ దాటుక్కుంటూ లోపలికి వెళ్ళాలా అనే ప్రశ్న. అంతకంటే ప్రధానమైనది నేను వేసుకున్న బూట్లు కింద భాగంలో చిన్న చిన్న కన్నాలూ, చిన్న చిన్న చిరుగులతో, పరి పరి విధాల వాసనలతో అలరారే సాక్సు కూడా విప్పేసి లోపలకి వెళ్ళవలయునా, లేక నా బండారం బయట పడకుండా బూట్లతోనే టకటకా లోపలకి పోవచ్చునా అనే సమస్య. అన్నట్టు, ఈ సాక్సు అనే వాటికి తెలుగు మాట ఏమిటో నాకు తెలియదు. వాటిని "సాకులు" అందామనుకుంటే అదేదో వంకలు పెట్టాననుకుంటారు కదా! బహుశా గూగుల్‌లో తెలుగు పదాల సైట్ లో ఏమన్నా ఉందేమో చూడాలి. ఈ మధ్య మా హ్యూస్టన్ సాహితీ లోకం వారి గూగుల్ గ్రూపులో తెలుగులో కొత్త పదాల సృష్టి మీద చర్చ జరుగుతోంది. పాఠకులందరినీ అందులో చేరి, చర్చలలోనూ, ఇతర విషయాలలోనూ చురుకుగా పాల్గొని, నాకు జ్ఞానాన్ని ప్రసాదించమని కోరుతున్నాను.

ఎనీ వే, ఈ బూట్లు విప్పుటయా లేక మానుటయా అను సమస్యా పరిష్కారానికి, నా బ్రిలియంట్ బుర్రకి పదును పెట్టి నేను కనిపెట్టిన మార్గం ఏమిటంటే, నా కంటే ముందు మరొక అతిథి ఏ విధముగా ఇంట్లోకి అడుగుపెట్టెనూ అని గమనించుట. అంతకంటే ముఖ్యంగా ఇంటాయన లేదా ఇంటావిడ పాద పరీక్ష చేయుట. వాళ్ళిద్దరిలో ఎవరైనా ఇంట్లో చెప్పులు వేసుకుంటే మనం హాయిగా మన సాక్సు రహస్యం కాపాడుకుంటూ లోపలికి వెళ్ళిపోవచ్చును కదా!

ఈ పాద పరీక్ష ఫార్ములా అన్ని చోట్లా పనికిరాదని కూడా ఒక ఊళ్ళో తెలుసుకున్నాను. ఇక్కడ ముఖ్య గమనిక ఏమిటంటే, గరాజ్ లోంచి ఇంట్లోకి ప్రవేశం ఉంటే, సర్వసాధారణంగా డైరెక్ట్‌గా కిచెన్‌లోకి వెళ్ళిపోతాం. మహా అయితే అప్పుడప్పుడు దారిలో వాషరూ, డ్రయ్యరూ, మాసిన బట్టలూ, ద్రావకాలూ దాటుకుని వెళ్ళాలి. నేను గమనించిన మరొక విషయమేమిటంటే, చాలా మంది వాస్తు శాస్త్రంలో చచ్చేటంత రిసెర్చ్ చేసి, తూర్పు దిశలో ముఖ ద్వారమూ, ఈశాన్యంలో దేవుడి గదీ, ఆగ్నేయంలో వంట గదీ, హై స్కూలు పేసయ్యేదాకానే ఇంట్లో ఉండి, తరవాత కేవలం డాలర్ల కోసమే ఇంటికి వచ్చే పిల్లల గది వాయవ్యంలోనూ అన్నీ సవ్యంగా కట్టుకుని, - తీరా ఇల్లు పూర్తయిన తరవాత కొనుక్కున్న కూరగాయలు ఇంట్లోకి తీసుకెళ్ళడానికి కారు గరాజే సదుపాయంగా ఉంటుంది కదా అని లక్ష్మీ దేవి ప్రవేశించే ముందు గుమ్మం మూసేసి, అప్పుల దేవుడైన యముడు పరిపాలించే దక్షిణ ముఖంలో ఉండే కారు గరాజ్‌లోంచి రాకపోకలు సాగిస్తూ, ఈ వెధవ క్రెడిట్ కార్డ్ అప్పులు ఎందుకు అలా పెరిగిపోతున్నాయా అని భోరుమంటూ ఉంటారు.

ఏమైతేనేం, ఈ మహా నగరంలో ఇంటాయన టెన్నిస్ జోళ్ళతో ఉన్నాడు కాబట్టి నేను "గరాజ్ దవారం" లోంచి కిచెన్‌లోకి దూసుకుపోతూండగా, ఇంటావిడ సుందర పాదారవిందములు చీర అంచున కనపడి, ఠక్ అని ఆగిపోయాను. ఎందుకంటే ఆవిడ కాళ్ళకి కించిత్తు పసుపూ, వెండి కడియములూ మెరుస్తున్నాయి. చెప్పులు పూర్తిగా మిస్సింగు. వంటిట్లో జోళ్ళు వేసుకోకూడదనే మడీ, - ఆచారము బాపతా లేక ఆవిడకి హవాయి చెప్పుల మీద మోజు లేదా అనుకునేలోపునే ఇంటాయన వంటింటి బయట, వాషర్ ముందు తన టెన్నిస్ బూట్లు విప్పేసి, పెద్ద గొంతుకతో, గట్టిగా, ఆప్యాయంగానే ఆవేశపడిపోతూ "రండి, సార్, మీరు మా ఇంట్లో అడుగుపెట్టడం మా అదృష్టం" అనే డైలాగులు చెప్తున్నాడు. ఆ క్షణంలో నేను బట్టల మెషీన్ ముందు ఉన్న చెప్పుల గుట్టలు చూసి నేను బిగుసుకుపోయాను. ఇప్పుడు వెనకడుగేసి, బూట్లు విప్పాలి, తప్పదు కాబోలు అనే ఆలోచనే ఆ విధంగా నేను బిగుసుకుపోవడానికి ఒక కారణం. అంతకంటే ప్రగాఢమైన కారణం, ఈ ట్రిప్పులో నేను రెండు, మూడు జతల సాక్స్ పెట్లో పెట్టుకోవడం మర్చిపోయి, గత వారంగా ఒకే ఒక్క జతతో కాలం గడిపేస్తున్నాను. వెధవది, పాండ్స్ వారి టాల్కం పౌడరూ, శింథాల్ వారి మైసూరు శాండల్ పౌడరూ కలిపి, రంగరించి, ఎవరూ చూడకుండా ఎంత వేసినా, బూట్లు విప్పానో, కొంపమునిగిందే! అంత స్వానుభవం ఉన్న వాణ్ణి కాబట్టే, చిదంబర రహస్యాలు తెలిసిన వాణ్ణి కాబట్టే మా ఇంటికి ఎవరు వచ్చినా, బాబోయ్, బూట్లు విప్పకండి అని బతిమాలతాను.

ఆ నాడు నా వాలకం గమనించి మొహమాటంగా మొహం అదోలా పెడుతూ, పరవాలేదు సార్ అని మా గృహస్థు గారూ, చెప్పులతో కిచెన్‌లోకి వచ్చావో, చచ్చావే అని గృహిణీ పరస్పర వీక్షణ కార్యక్రమంలో ఉండగా, మాతో కూడా వచ్చిన ఒకానొక గాయకుడు గారు కిచెన్‌లోంచి లివింగ్ రూం లోకి వెళ్ళి సోఫా మీద చతికిల పడ్డాడు. కనీసం బూట్లు విప్పే ప్రయత్నం కూడా చెయ్యలేదు.

అప్పుడు నాకు మళ్ళీ జ్ఞాపకం వచ్చిన విషయం ఏమిటంటే, ఇండియానుంచి మన అమెరికా తెలుగు వారు ఎంతో డబ్బు ఖర్చుపెట్టి ఆప్యాయంగా తీసుకొచ్చే కళాకారులకి పరాయి దేశం వచ్చారు కదా అని వారికి సకల సౌకర్యాలూ కలిగిద్దామని కష్టపడే - ఆర్గనైజర్లకీ, వారిని ఆహ్వానించి తమ ఇంట్లో ఆతిథ్యం ఇచ్చే వారికీ కొంతమంది కళాకారుల ప్రవర్తన చూడగానే, పరభాగ్యోపజీవులు, నిస్సంతోషులూ, జుగుప్సావంతులూ మొదలైన "నీతి చంద్రిక" లోని మాటలు జ్ఞాపకం వస్తాయి. అమెరికాలో కూడా మంచి ఏ.సీ...అనగా ఆంధ్రా కల్చర్ పాటిస్తూ అతిథి మర్యాదలు చేస్తున్న వారింట్లో కూడా బీ.సీ ..అనగా క్రీస్తు పూర్వం నాటి బుద్ధులు దాటి ఎదగని కొంతమంది కళాకారులు అలా ఎలా ఉండగలరో నాకు అర్థం అవదు. ఇండియాలో మడత మంచం వేసుకుని రోడ్డు మీద పడుకునే వాళ్ళు, అమెరికా రాగానే ప్రత్యేకమైన గెస్ట్ రూములో హంసతూలికాతల్పం కావాలి అని పేచీ పెట్టినా, మెక్‌డొనాల్డ్స్ వారి మెక్‌చికెన్ కావాలన్నా నేను అర్థంచేసుకోగలను కానీ, సహగాయనీగాయకులని స్టేజి మీదే చిన్న చూపు చూడడం, కష్టపడి అన్ని ఏర్పాట్లూ చేసిన

నిర్వాహకులని కించపరచడం నేను భరించలేని దుష్ప్రవర్తన. ఆ "లక్ష్మణ రేఖ" ఈ గాయకుడు చాలాసార్లు దాటాడు. దానితో పోల్చి చూస్తే ఆ రోజు వాళ్ళింట్లోకి జోళ్ళతో వెళ్ళిపోవడం కొంచెం నయమే!

అనేక మంది ఇళ్ళలో ఆతిథ్యం పొందినప్పుడు, నేను గమనించిన మరొక చిన్న విషయం ఏమిటంటే, అమెరికాలో గృహస్తులు నాలుగు రకాలు. మొదటి రకం వారు దైవ భక్తులు. వీళ్ళింట్లో కిచెన్‌లోనో, మరొక గదిలోనో, ఒకే దేవుణ్ణి నమ్ముకుంటే కిట్టదేమో అని కాబోలు, డజనుపైగా దేవుడి బొమ్మలు పెట్టుకుంటారు, మా క్వీన్ విక్టోరియా లాగానే. మనకి అక్కడ అగరొత్తుల సుగంధమూ, మరియు కర్పూరం వాసనా వేయును. నో ప్రోబ్లెం. రెండో రకం వారు ఏదో బాబా లేదా ఏదో స్వామీజీ భక్తులు. వీళ్ళింట్లో దేముడి బొమ్మలు అక్కడక్కడా ఉన్నా, బాబా లేదా స్వామీజీ గారి నిలువెత్తు బొమ్మలు ఒక గదిలోనో, పెద్ద హాలులోనో ప్రతిక్షేపించి ఉంటాయి. వీళ్ళు రెగ్యులర్ గా భజనలు చేస్తూ ఉంటారు. అదెలా నాకు తెలిసిందంటే ఆ గదిలో తబలాలూ, సీడీ ప్లేయర్లూ, ఇతర భజన సామగ్రీ కనపడాతాయి. నో ప్రోబ్లెం. మూడో కేటగిరీ వారు ఎందుకైనా మంచిదని దేవుడి బొమ్మలు పెట్టుకుని, కొంప మునిగినప్పుడు మాత్రమే దణ్ణం పెట్టుకునే వారు, నాలాగా. నో ప్రోబ్లెం. ఇక నాలుగో రకం వారు ఇంటికి వచ్చిన అతిథులని బట్టి తమ "దైవ రహస్యాల" గురించి మాట్లాడేవారన మాట. అనగా కాషాయ వస్త్రాల వారు ఊళ్ళోకి వస్తే అఖండమైన భక్తీ, సినీతారలు వస్తే అంతకుమించిన అనురక్తీ వెలగబెడతారన మాట. ఇది కూడా నో ప్రోబ్లెం అనే చెప్పాలి.

అసలు రహస్యం ఏమిటంటే, ఈ "దైవికపరమైన" నాలుగు కేటగిరీలలోనూ, తొంభై శాతం ఇళ్ళలో కాస్తో, కీస్తో "సురాపానం" చెయ్యవచ్చు. ఇక్కడ "కాస్త" అనగా "స్కాచ్" లాంటి ఖరీదు మందులనియూ, "కీస్త" అనగా రెడ్ వైన్ లాంటి హృదయారోగ్యకరమైన మందులనియూ గమనిక. ఇది మటుకు ఎబ్సొల్యూట్లీ నో ప్రోబ్లెం అనే చెప్పాలి. అదే ఇండియాలో అయితే, చాలా మంది ఇళ్ళలో పెళ్ళాం ముందు దైవారాధనా, బయటకి రాగానే "సారా"ధనారాధనా". అమెరికాలో అంత హిపాక్రసీ లేదు. పైగా ఇంటి బయట ఉన్న చెప్పుల సంఖ్యని బట్టి మనం వారి దైవ భక్తినీ, మరియు సురాపానాసక్తినీ కూడా అంచనా వెయ్యవచ్చునేమో! ఏమో!

మరొక రకం గృహస్థులు కూడా అమెరికాలో మెండుగానే ఉన్నారు. వీళ్ళు అందరికీ కనపడే లివింగ్ రూమూ, కిచెనూ వగైరాలు బాగా సద్దుతారు. బాగా ఏమిటి, నా మొహం. ఖరీదైన ఫర్నిచరూ, డెకోరేషన్సూ మొదలైనవి చాలా అందంగా ఉంటాయి. వాళ్ళ సోఫాలో కూచోడానికి భయం వేసి నేను ఎప్పుడూ పక్కనే దాచిపెట్టిన పేము కుర్చీలోనే కూచుంటాను, ఎందుకైనా మంచిదని. ఎటొచ్చీ, నేను వీళ్ళ అసలు "రంగు" తెలుసుకోడానికి అప్పుడప్పుడు రహస్యంగా వాళ్ళ మాస్టర్ బెడ్ రూంలోకి తొంగి చూస్తాను. అంతే సంగతులు. ఆ పెద్ద గదిలో నా సైజు...అనగా కింగ్ సైజు, లేదా కనీసం విక్టోరియా సైజు...అనగా క్వీన్ సైజు పక్క...అనగా బెడ్ మీద చీరలూ, చొక్కాలూ, తడి తువ్వాళ్ళూ ఎడా పెడా పడేసి ఉంటాయి. ఆడంగుల మేకప్ సామాన్లూ, ఇంటాయన క్షవరం సామాగ్రీ అన్ని చోట్లా పరిచేసి ఉంటాయి. అంటే, నలుగురూ చూసే చోట్లు అతి వైభవంగానూ, పరిశుభ్రంగానూ, ప్రవేటు గదులు నా మొహం లాగానూ ఉంటాయన మాట. ఇందులో నీతి ఏమిటంటే, మనం ఎవరిదైనా పబ్లిక్ లైఫ్‌ని చూసి ఆనందించాలి కానీ, వారి ప్రయివేటు జీవితాల కేసి పోకూడదూ అని.

మొత్తానికి నేను గమనించినదేమిటంటే, అమెరికాలో అతిథులందరినీ ఆత్మీయులుగా చూసుకునే మొగుడ్స్ అండ్ పెళ్ళాంస్ ఎన్ని విధాలుగా చూసినా ఎంతో సహృదయులు. ముఖ్యంగా ఇండియానుంచి వచ్చిన వారికి ఎక్కువ మర్యాదతో అన్ని సౌకర్యాలూ కలిగిస్తారు. ఇండియా అతిథులలో కొంత మంది నిస్సంతోషులూ, పరభాగ్యోపజీవులూ ఉన్నా, మరికొంత మంది "సింగర్" విజయలక్ష్మి లాగా ఎంతో సద్దుకుపోయి, అటు ఆర్గనైజర్లకి కానీ ఇటు గృహస్తులకి కానీ ఏ మాత్రం ఇబ్బంది కలిగించకుండా ప్రేక్షకులు ఆశించిన వినోదాన్ని

పంచిపెడతారు. అందుకే ఆ అమ్మాయి అన్నా, అటువంటి మంచి కళాకారులన్నా, వికలాంగుల సేవలో అష్టకష్టాలూ పడుతున్నా, మంచి కళాకారులని అహర్నిశమూ ప్రోత్సహించే వంశీ రామరాజుగారన్నా నాకు భలే ముచ్చట.

కళాకారులనీ, సంఘసేవకులనీ, ఎటూ చెందని నా బోటి వాళ్ళనీ కూడా ఆదరించే అమెరికా గృహస్తులందరికీ కేవలం శిరస్సు మాత్రం వంచి పాదాభివందనం చేస్తున్నాను. నా శరీరంలో మిగిలిన భాగాలు అంత సహకరించవేమో అని భయంతో మొత్తం బాడీని శ్రమ పెట్టడం లేదు. ఎందుకంటే, మొన్న వినాయక చవితికి ఆవేశంగా సాష్టాంగ దండప్రణామంబులు చరించి, పైకి లేచుటకు మళ్ళీ స్పెషల్ ప్రార్ధన చెయ్యవలసి వచ్చింది.

ఒకటేమిటి, అమెరికాలో ఇంచుమించు అన్ని రాష్ట్రాలలోనూ గత మూడు దశాబ్దాలగా వందల కొద్దీ మంచి గృహస్తులనీ, కళాకారులనీ, సంఘసేవకులనీ కలిసే, కలిపే అవకాశాలు నాకు అనేకం రావడం నా అదృష్టమే!.

"అదృష్టమా, నీ తలకాయా, పనీ, పాటూ లేకపోతే సరి" అని శుద్ధ గ్రాంధికంలో మా క్వీన్ విక్టోరియా పరిపరివిధములగా ప్రవచించినా, నుడివినా, అరిచి గీపెట్టినా, నేను కనను, వినను, మూర్కొనను. ఆవిడ అద్భుతమైన, ఏ కోశాన్నా అమెరికనైజ్డ్ కాని శుద్ధ తెలుగు వంట మటుకు రోజూ భుజిస్తాను. అదే నా అసలు, సిసలు అదృష్టం. ఏమంటారు?

